క్లుప్తంగా

ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ

కృష్ణా: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఎంపీడీఓ విజలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రెనర్లుగా ఉపాధ్యాయులు నరేందర్, నాగభూషణం వ్యవహరించారు. ఈ సందర్భంగా మండంలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిర్వర్తించే బాధ్యతలు, ఎన్నికల ప్రక్రియ, నియామవళి తదితర అంశాలపై విపులంగా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు.

రాజకీయ నాయకులు సహకరించాలి

కొత్తపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ నాయకులు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ జయరాములు కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాజకీయ నాయకులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అలాగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల గురించి అలాగే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున వెంట రూ.50 వేలు కంటే ఎక్కువ తీసుకెళ్తే పత్రాలు చూపించాల్సి ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావ్, ఎంఆర్ఐ శ్రావణ్ కుమార్, మద్దూరు ఏఎస్ఐ ఉస్మాన్, పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



మాగనూర్: మండల పరిధిలోని నేరడగం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలిగా గుర్తింపు పొందిన రాయిచూర్ పార్వతమ్మ (106) మృతి చెందింది. వృద్ధాప్య సమస్యల కారణంగా బుధవారం మరణించింది. పార్వతమ్మకు 6 మంది మగ సంతానం, ఒక ఆడ సంతానం ఉన్నారు. అందులో ఏడుగురు మనవళ్ళు... ఐదుగురు మనవరాళ్లు, పది మంది ముని మనవళ్లు ఉన్నారు. కాగా మొదటి కూమారుడు గత సంవత్సరం అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు.

శుభకార్యానికి వెళ్లొస్తుండగా ప్రమాదం



మాగనూర్: మండల కేంద్రంలోని అభిషేక రెస్టారెంట్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మందికి పైగా గాయపడ్డారు. నారాయణపేటకు చెందిన కొందరు వాహనంలో శుభకార్యం నిమిత్తం రాయచూర్‌కు వెళ్లి తిరిగొస్తుండగా ఎదురుగా వస్తున్న కారు, తుఫాన్ ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు మహిళలతో పాటు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా తుఫాన్ వాహనంలో ఉన్న 10 మందిలో తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

రెడ్డి సేవా సమితి ఏర్పాటు



కొత్తపల్లి: మండల నూతన రెడ్డి సేవా సమితిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొట్ల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, కోశాధికారిగా నర్సింహరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ముకుందారెడ్డి, ప్రచార కార్యదర్శుగా సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణరెడ్డి, శివరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్లుగా శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డిను ఎన్నుకున్నారు. ఈ సేవా సమితి ద్వారా రెడ్డిల ఉన్నతితో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు.

సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలి

మక్తల్: నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషలతో పండుగ జరుపుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. విజయదశమి సందర్భంగా బుధవారం నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.





కోస్గిలో అమ్మవారి శోభాయాత్ర



మక్తల్‌లో దేవతల వేషధారణలతో చిన్నారులు

శక్తి స్వరూపిణి.. మహిషాసురమర్దిని



మరికల్‌లో..



మద్దూరులో కొలువుదీరిన అమ్మవారు



నర్వలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా పూజలందుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మండపాలలో ఏర్పాటు చేసిన అమ్మవారిని భక్తులు జగన్మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. పలుచోట్ల శోభయాత్రలు జరిపించారు.

- నారాయణపేటలో అమ్మవారు మహిషాసుర మర్ధిని మాతగా దర్శనం ఇచ్చింది. మండలంలోని సింగారం గ్రామ శ్రీగిరి పీఠంపై భవానిమాత ఆలయంతో పాటు కోటకొండ వాసవిమాత ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి భక్తులకు సర్వ దర్శనం అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు.
- మరికల్‌లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.
- మక్తల్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో చిన్నారులను దేవతా మూర్తులుగా అలంకరించారు. దాదాపు 18 మంది దేవతామూర్తులుగా అలంకరించి పూజలు జరిపించారు. అలాగే స్థానిక కన్యకపరమేశ్వరి ఆలయంలో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు.
- దామరగిదలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు.
- కోస్గిలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేక రంగు చీరలు, నైవేధ్యాలతో అమ్మవారిని పూజించి బుధవారం శోభయాత్ర నిర్వహించారు. తొమ్మిది రోజుల అనంతరం బుధవారం శోభయాత్ర ఘనంగా నిర్వహించి అమ్మవారిని జల ప్రవేశం చేయించారు.
- మద్దూరులో కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి పాతబస్టాండ్ ఆంజనేస్వామి ఆలయం వరకు అమ్మవారి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు.
- నర్వలో కొలువుదీరిన అమ్మవారు మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ఇష్టమైన ఎరుపు రంగు చీర, పులిహారతో నైవేద్యం సమర్పించి పూజలు జరిపించారు.

అమ్మవారిని దర్శించుకున్న నటి

జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానం శక్తి పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో బుధవారం అమ్మవారు మహిషాసుర మర్ధిని దేవిగా దర్శనమిచ్చారు. తెలుగు సినీ నటి శిరీష మహిషాసుర మర్ధిని అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని భక్తులకు అన్నదానం చేశారు.



దామరగిద్దలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



సింగారం శ్రీగిరి పీఠంపై..



మద్దూరులో అమ్మవారి పల్లకీ సేవ



అమ్మవారి సేవలో సినీ నటి శిరీష

భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని దూల్‌పేట అంబభవానీ మందిరంలో దేవీ నవరాత్రి వేడుకలలో భాగంగా బుధవారం ఆయుధ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. వేడుకల్లో నాయకులు వెంకటయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ, సభ్యులు రఘువీర్ యాదవ్, కన్న శివకుమార్, ఆషప్ప, శ్రవణ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మాగనూర్/మద్దూరు: విజయదశమిని పురస్కరించుకొని బుధవారం మండలంలోని పలు గ్రామాలలో ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలిస్టేషన్‌లో ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమం జరిపించారు. ఏటా దసరా పండుగ ముందు ఆయుధ పూజ నిర్వహించడం సంప్రదాయంగా వస్తుందని, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి జరుపుకోవడం జరుగుతుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మక్తల్: పట్టణంలోని కన్యకపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవిమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన పూర్ణహూతి కార్యక్రమం పలువురు దంపతులు పాల్గొని హోమం నిర్వహించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చూపరులకు కనువిందు చేశారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హోమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ బుధవారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు ఉత్సవ సమితి సభ్యులు వినతిపత్రం అందజేశారు. విగ్రహాల నిమజ్జనం కోసం కొండారెడ్డి చెరువు వద్ద శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు క్రేన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా పట్టణంలో జరిగే నిమజ్జన శోభాయాత్రకు అనుకూలంగా రోడ్ల మరమ్మతు చేపట్టాలని విన్నవించారు. అందుకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ నాయకులు భీంచందర్, కన్న శివకుమార్, వెంకటయ్య, రఘువీర్ యాదవ్, నందు నామాజీ, ఆశప్ప పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో మొదటి విడతలో నిర్వహించే ప్రాదేశిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని మద్దూరు, కొత్తపల్లి ఎంపీడీఓలు రహ్మతుద్దీన్, కృష్ణరావ్ పీఓలు, ఏపీఓలకు సూచించారు. బుధవారం పీఓ, ఏపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

ఉమ్మడి మద్దూరు మండలంలో ప్రాదేశిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని మాడల్ కోడ్ అఫ్ కండక్ట్ అధికారి మహేష్ గౌడ్ పంచాయతీ కార్యదర్శులకు, జీపీఓలకు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పార్టీలు అనుసరించాల్సిన విధానంపై నాయకులకు వివరించారు. కార్యక్రమాల్లో ఎంఈఓలు బాలకిష్టప్ప, ఆంజనేయులు, ఎంపీఓ రామన్న తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలపై శిక్షణ ఇస్తున్న విషయ నిపుణుడు

దేశ సేవకు యువత సిద్ధంగా ఉండాలి

మరికల్/మక్తల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంస్థను స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం దేశ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టమని ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ ప్రచారాకులు గుంత లక్ష్మణ్‌జీ అన్నారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. దేశ రక్షణ కోసం ఆర్‌ఎస్‌ఎస్ పుట్టిందని, భారతమాతకు సేవ చేయడం కోసం యువత సిద్ధంగా ఉండాలన్నారు. పల్లెల్లో కూడా ఆర్‌ఎస్‌ఎస్‌ను విస్తీరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం

ఊట్కూరు: భారతీయ సంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతబౌదిక్ ప్రముక్ కురజయదేవ్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభించి 100 ఏళ్లు అవుతుందన్నారు. దేశంలో కాకుండా విదేశాలలో సైతం సంఘ శాఖలు నడుపనున్నట్లు తెలిపారు. మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ గరిడి నింగిరెడ్డి, నాయకులు లక్ష్మన్, భాస్కర్, కేశవరావ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్కోటి ఎల్లారెడ్డి జయంతి



ఊట్కూరు: దివంగత మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి జయంతి వేడుకలను మండలంలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్లారెడ్డి మంత్రిగా మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో ఎంతో అభివృద్ధి చేశారని ఆయన సేవలను కొనియాడారు. మాజీ ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాష్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

నారాయణపేట: మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వయోవృద్ధుల గృహంలో ఎల్లారెడ్డి వీరాభిమాని జగదీశ్‌గౌడ్ పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు.

నేటి నుంచి సయ్యద్‌షా ఖాద్రి ఉర్సు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని హజ్రత్ సయ్యద్‌షా మహమ్మద్ ఖాద్రీ దర్గాలో గురువారం నుంచి ఉర్సు ప్రారంభమవుతుందని దర్గా పెద్దలు సయ్యద్ షా గియాసుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 రోజుల పాటు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయని, వేడుకలకు ఏపీతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

దేవరకద్ర: రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ శశికాంత్ కోరారు. బుధవారం దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం అందక ఎందరో మృతిచెందిన ఘటనలు ఉన్నాయన్నారు. రక్తదానం చేయడంతో ఎందరినో రక్షించే అవకాశం లభిస్తుందన్నారు. వైద్యాధికారి శరత్‌చంద్ర, మధుసూదన్‌రెడ్డి, ఓంకార్, కోటేశ్వర్‌రెడి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

నారాయణపేట రూరల్: మండలంలోని మేక హనుమాన్ తండా పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలపై స్థానిక ప్రజలు ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీని కలిసి ఊరిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా పంచాయతీ పరిధిలోని ఆమ్లేట్ గ్రామం తిరుమల దేవునిపల్లి నుంచి కొల్లంపల్లికి ఆరు కిలోమీటర్ల అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని, తద్వారా రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని విజ్ఞప్తి చేశారు.

మంత్రి వాకిటి శ్రీహరి పరామర్శ



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అరుణ, నారాయణరెడ్డి కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం నిడుగుర్తిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. మంత్రి వెంట నాయకులు సూర్యప్రకాష్‌రెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, కృష్ణార్జున్‌రెడ్డి, లింగం తదితరులు ఉన్నారు.

దామరగిద్దలో వైద్యశిబిరం

దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్థ్ నారి.. సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చర్మ వ్యాధి, జనరల్ ఫిజిషియన్ వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఎన్ ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ సుదేష్ణ మాట్లాడుతూ 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక వైద్యులు అమీర్, సోహెల్, సూపర్‌వైజర్ కిష్టమ్మ, ఫార్మసిస్ట్ వె వెంకట్రామరెడ్డి, ఏఎన్‌ఎంలు, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



మాగనూర్: మండలంలోని వడ్వాట్ గ్రామానికి చెందిన తల్వార్ ఉపేంద్ర జాతీయ స్థాయి పడవ పోటీలకు ఎంపికైనట్లు రిటైర్డ్ పీఈటీ గోపాలం తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొంది ఖేలో ఇండియా జాతీయ స్థాయి రోయింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 11 నుంచి 17 వరకు కేరళలోని అల్లపూజహ సరస్సులో జరిగే పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.

నర్వ విద్యార్థిని ప్రతిభ



నర్వ: జాతీయ స్థాయి పోటీలకు నర్వ విద్యార్థిని ఎంపికైనట్లు రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. గ్రామానికి చెందిన చింతచెట్టు కృష్ణయ్య, లక్ష్మి దంపతుల కూతురు రాధమ్మ ఇటీవల మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన 44వ, జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరఫున ప్రతిభ చాటిందన్నారు. నవంబర్‌లో యూపీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

తిరుమల బ్రహ్మోత్సవాల్లో పేట యువకుడు

నారాయణపేట రూరల్: తిరుమల బ్రహ్మోత్సవాల్లో పేట యువకుడు పాల్గొన్నాడు. సాలకట్ల ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రత్యేక వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మాడ వీధుల్లో ఉత్సవ వాహనం ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆధ్యాత్మిక నృత్యాలు చేశారు. వెంకటేశ్వర స్వామి అలంకరణలో పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బలింగం కుమారుడు రాకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



వేంకటేశ్వర స్వామి అలంకరణలో రాకేష్

పండుగ పూట యూరియా కష్టాలు



నారాయణపేట రూరల్: పట్టణంలో పండుగ పూట కూడా యూరియా కోసం రైతన్నలు అవస్థలు పడ్డారు. స్థానిక శ్రీ సత్యనారాయణ చౌరస్తా సమీపంలోని హాకా రైతు సేవా కేంద్రానికి బుధవారం 150 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు చుట్టుపక్కల గ్రామాల నుంచి యూరియా కోసం క్యూకట్టారు. ఈ క్రమంలో సిబ్బంది రైతులను ఆధార్‌కార్డు, వేలిముద్రలను తీసుకొని యూరియా సరఫరా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరిపడా యూరియాను అందించి పంటలు దెబ్బతినకుండా ఆదుకోవాలని కోరుతున్నారు.

పేటలో అలరించిన మ్యాజిక్ షో

నారాయణపేట రూరల్: పట్టణంలోని సరాఫ్ బజార్ శ్రీ బసవేశ్వర దేవాలయం దగ్గర నిర్వహించిన మిమిక్రీ, మ్యాజిక్ షో అలరించింది. స్థానిక స్నేహ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మదన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఆర్టిస్టులు బుధవారం నారాయణపేటకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ, సినీ పరిశ్రమకు సంబంధించిన వ్యక్తుల మాటలను మిమిక్రీ చేసి ఆకట్టుకున్నారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో దాండియా ఆడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, వైద్యులు పాల్గొన్నారు.

